గల్పిక

# వంశచక్రం

వేదుల కామేశ్వరరావు

గదిలోపల గందరగోళం. నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఏవో కేకలు ఏదో అవ్యక్తమైన ఆవేదన నిట్టూర్పులు. మధ్యమధ్య ఆలోచనల దొంతరలు ఆశయాలనూ, ఆశలనూ నెట్టేస్తూ ఏవో అనుమానాలు బాధ ... మూలుగులు ... "ఎట్లావుంది?" సావిట్లోంచి గదిలోనికి ప్రవేశిస్తోంది ఒక ప్రశ్న.

మళ్ళీ కేకలు...ఏడుపులు...ఆక్రందనలు... రాగాలు ... మూలుగులు ... గుండెలు కోరికేసే అరుపులు. ఉన్నట్టుండి పసికందు "కేర్" మంటున్న శబ్దంలో "మగపిల్లవాడు" అన్న కేక.

ఉద్రేకం...ఉత్సాహం...సంతోషం...సంరంభం మగపిల్లవాడు...వంశోద్ధారకుడు! పెరుగుతాడు. పెద్దవాడవుతాడు. బ్రతికి బట్టకడతాడు. అందరినీ పోషిస్తాడు. అందరికీ ఏదో వొక పెద్ద జ్యోతిని వెలిగిస్తాడు. చిరునవ్వులు చిందులాడుతున్నాయ్. మేఘాలకు పైగానే భావాలు పరుగెత్తాయి ... విజయోత్సాహం పొంగిపోతోంది. అందరికీ సంతోషం. అందరిలోనూ ఆనందం... అనురాగం...అభిమానం!

సుబ్బారావు బాధ్యత తీరినట్లుగా ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. కసిగందువైపు ఆశగా చూశాడు. చిరునవ్వుల పెదవులపై ముద్దుల వర్షాలు. అవును! అతడే తన వంశోద్ధారకుడు!

సావిట్లో కోలాహలం బడిపంతుళ్ళ ఆశీర్వాదాలు! చిన్ని పిల్లల సంతోషాల దొంతరలు! వారంతా స్నేహితులు అదంతా ఒక సంఘం... తియ్యటి పప్పుబెల్లాల చప్పరింతలు అది సుబ్బారావు కొడుకు రామారావు అక్షరాభ్యాసం!

ఊళ్ళో హడావిడి పేపర్ల స్వైర విహారాలు నెంబర్ల గారడీ! ఉత్సాహాలు...ఉద్రేకాలు... సంతోషాలు...విందులు...వినోదాలు! ఆవేశాలు విచారాలు...వ్యథలు ... వంశోద్ధారకుడు పరీక్ష తప్పాడు! ఇంట్లో ఏదో బాధ...పస్తులు...పరామర్శలు!

తూతూబాకాలు ... సన్నాయి వాద్యాలు. పురోహితుల మంత్రఘట్టాలు కలకలలు... వేళాకోళాలు...ఆనందం...అందరిలోనూ సంతోషం. మంగళసూత్రం ముడిపడ్డది! ఏదో నవశక్తి... నూతన శోభ...కళ...కాంతి...అనురాగం... ప్రేమ...వలచివచ్చిన 'వరూధిని' వరించిన శిరముపైన అక్షింతలు! క్రొత్తబట్టల పంపిణీలు! లాంఛనాల తగాదాలు...ఇంతలోనే సంతోషం! 'శీఘ్రమేవ సంతాన ప్రాప్తిరస్తు" పెద్దల ఆశీర్వాదాలు... వందనములు...అభివందనలు...కల్యాణం!

ఏవో క్రొత్త బాధలు... ఆర్థిక దుస్థితి! నిరుద్యోగ సమస్య తాండవిస్తోంది. పెరిగే సంసారం చాలని సంపాదన...ఆహార సమస్య...జనసంఖ్య పెరుగుతోంది...క్షామం... తీవ్రనిరసనలు! అసంతృప్తి...ఆవేశాలు...సత్యాగ్రహాలు!

సంసారం బాధ్యత...అతిథుల నిత్యప్రవేశం. ఏదో బాధ...నిండుకొన్న బియ్యపు డబ్బా... పెళ్ళికాని ఆడపిల్లా...ముసలివాని కుళ్లుదగ్గు... అంతా నరకం...చీదర...గందరగోళం...అసహ్యం... రోగాలు...కోపాలు...ఇంతలోనే అనురాగం... ప్రేమ...వారు చిలకా గోరింకలవంటి దంపతులు!

మళ్ళీ గదిలో గందరగోళం. నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఏవో కేకలు. కేకలలో ఏడుపు స్వరాలు... సావిట్లో అడుగుల చప్పుడు...ఆవేదన...ఆందోళన...ఆవేశం...అరుగుమీద ముసలిజీవి మూలుగు స్వరం...గదిలో మూలుగు ఇంకా పెద్దది! నరనరాలు కోరికేసే బాధ...తరతరాలు అనుభవించే వారసత్వపు పురిటి నొప్పులు! భయం...ఏదో ఆశ... ప్రేమ ..అనురక్తి...కోర్కె...."అమ్మా!"...బాధ.

"ఎల్లా వుంది?" సావిట్లోంచి ఆవేదనతో గొంతుకలోనే అణిగిపోయిన ప్రశ్న!

ఉత్సాహం...ఉద్రేకం...పుత్రోత్సాహం... చిరునవ్వుల చిందులు... తేనీటి విందులు...బుగ్గలపై ముద్దులు...ఆడవాళ్ళ సంతృప్తి ప్రవచనాలు... ఆశగా "కొడుకు"వైపు "తండ్రి"గారి చూపులు!

"మగపిల్లవాడు!" అనే శబ్దం అరుగుమీద ముసలిజీవి ముసుగులోకి దూరుతోంది.

"పోనీలే! వంశోద్ధారకుడు!" "తాత"గారి వాక్కులలో ఆశ తాండవిస్తోంది. ★